నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, గురువారం 17 అక్టోబర్ 2024 HYDERABAD


# 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

హైదరాబాద్‌లో 8 సెంటర్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : ఈనెల 21 నుంచి 27 వరకు గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లాలో 8 కేంద్రాల్లో 5,613 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్టు వెల్లడించారు. ఈనెల 14 నుంచే హాల్ టికెట్లు అందుబాటులో ఉంచినట్టు వివరించారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. మధ్యాహ్నం 1:30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు అందుకు తగినట్టుగా టైం టేబుల్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌లో అస్పష్టమైన ఫొటో ఉంటే అభ్యర్థి 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించాల్సి ఉంటుందని చెప్పారు. అభ్యర్థి తమ గ్రూప్ -1 సర్వీసెస్ ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంచుకున్న భాషలో అన్ని మెయిన్స్ పరీక్షలను (జనరల్ ఇంగ్లిష్ మినహా) రాయాలని, పరీక్షను ఎంచుకున్న భాషలో కాకుండా ఇతర భాషలో రాస్తే అటువంటి సమాధానాలు బుక్‌లెట్ మూల్యాంకనం చేయబడవని స్పష్టం చేశారు.

# సీపీఆర్‌పై అవగాహన



చిన్నపిల్లల్లో వచ్చే అనారోగ్య సమస్యలతో పాటు అకస్మాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు సీపీఆర్ చేయాల్సిన విధానాలపై అవగాహన కల్పించేందుకు ప్రముఖ పీడియాట్రిషియన్ డాక్టర్ శివరంజని ఆధ్వర్యంలో బుధవారం జూబ్లీహిల్స్ రోడ్ నం. 92లోని తాజ్ మహల్ హోటల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు, గృహిణులు, యువతీయువకులకు అత్యవసర సమయంలో పెద్దలతో పాటు పిల్లలకు సీపీఆర్ చేయాల్సిన పద్ధతిని నేర్పించారు.

-బంజారాహిల్స్, అక్టోబర్ 16

# అమరావతికి ఆమ్రపాలి

## ఆమె సేవలు మూడు నెలల ముచ్చటే



సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి విషయంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. క్యాట్ (సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యూనల్) ఆదేశాల మేరకు ఆమ్రపాలి ఏపీలో బుధవారం రిపోర్టు చేశారు. దీంతో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి సేవలు మూడు నెలల ముచ్చటగానే మిగిలాయి. 2024 జూన్ 26న కమిషనర్ రోనాల్డ్ రాస్ సెలవులో వెళ్లిన సందర్భంగా ఆమ్రపాలికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించారు. తర్వాత 2024 ఆగస్టు 21 నుంచి పూర్తిస్థాయి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. నాలుగు నెలల తిరగకముందే అమరావతికి ఆమ్రపాలి రిపోర్టు చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ కంటే ముందు ఆమ్రపాలి మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ఎండీగా, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తూనే బల్దియా కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. కొన్ని రోజులు మూడు బాధ్యతలు నిర్వర్తించారు. ఏ బాధ్యతల్లోనూ తనకంటూ ప్రత్యేక ముద్రను వేసుకోలేకపోయారు. ప్రధానంగా జీహెచ్ఎంసీలో మహిళా ఉద్యోగులకు ప్రతి జోన్‌కు ఒక బేబీ కేర్ సెంటర్ ఏర్పాటు లాంటి కీలక నిర్ణయం తప్ప.. పెద్దగా సంస్కరణలు, కొత్త విధానాలు తీసుకువచ్చే ప్రయత్నమేమీ చేయకపోవడం, ప్రజావాణికి, జోనల్ కమిషనర్లకు, విజిటింగ్ సమయంలో వచ్చే పౌరులకు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బక్కచిక్కిన సంస్థ ఖజానాను గాడిలో పెట్టే ప్రయత్నం కానీ, పారిశుధ్య నిర్వహణను చక్కదిద్దడంలో విఫలం అయ్యారనే ఆరోపణలున్నాయి. వందకు వంద శాతం చెత్త సేకరణ, శానిటేషన్ విభాగంలో అక్రమాలను అడ్డుకట్ట వేయలేకపోయారు.

### ఏడాదిలోపే క్యూ కడుతున్న కమిషనర్లు

గ్రేటర్‌లో కీలకమైన శాఖ ఏదైనా ఉందంటే అది జీహెచ్ఎంసీ మాత్రమే. కోటికి మందికి పైగా జనాభా కలిగిన నగరంలో పౌరులకు మౌలిక వసతుల కల్పన, మెరుగైన సేవలందించడంతో జీహెచ్ఎంసీదే ముఖ్య భూమిక. అలాంటి కీలకమైన శాఖకు కమిషనర్‌గా పట్టుమని రెండేండ్లు సైతం ఉండటం లేదు. కారణం ఏదైనా అలా వచ్చి .. ఇలా వెళ్తున్నారు. ఆమ్రపాలి కంటే అంతకు ముందు ఉన్న కమిషనర్ రోనాల్డ్ రాస్ సైతం బల్దియాపై పట్టు సాధించి గాడిలో పెట్టే సమయంలోపే ప్రభుత్వం ఇంధనశాఖకు బదిలీ చేసింది. దీంతో దాదాపు ఏడాది గడవకముందే రోనాల్డ్ రాస్ సేవలు జీహెచ్ఎంసీలో ముగిసినట్లైయింది. తర్వాత వచ్చిన కమిషనర్ ఆమ్రపాలి ప్రస్తుత పరిణామాలతో నాలుగు నెలల్లోపే జీహెచ్ఎంసీనే కాదు రాష్ట్రాన్ని వీడాల్సి వచ్చింది.

### కమిషనర్‌గా ఇలంబర్తి..

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా (ఎఫ్ఏసీ)గా ఇలంబర్తికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్‌ల స్థానాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జీలను నియమించగా.. ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పనిచేస్తున్న ఇలంబర్తికి జీహెచ్ఎంసీ బాధ్యతలు అప్పగించారు. అయితే డీవోపీటీ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పనిచేసిన ఆమ్రపాలి ఏపీలో రిపోర్టు చేశారు. ఈ క్రమంలో ఇలంబర్తి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.



బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేస్తున్న కేటీఆర్

# మేమున్నాం!

## పేదలకు రక్షణ కవచంగా బీఆర్ఎస్



- రేవంత్‌రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం
- మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బస్సుయాత్ర
- కూకట్‌పల్లి నుంచి హైడ్రా బాధితుల పరామర్శలు

**రేవంత్‌రెడ్డి పంపే హైడ్రా బుల్డోజర్లకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అడ్డుగా నిలబడతారని, హైదరాబాద్ నగరంలో పేదలకు బీఆర్ఎస్ రక్షణ కవచంలా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. హైడ్రా, మూసీ ప్రాజెక్టు బాధితులకు భరోసా నింపేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ భవన్‌లో గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఇందులోభాగంగానే మూసీ పరీవాహక ప్రాంతాల్లో బీఆర్ఎస్ బస్సు యాత్ర చేపట్టనున్నది. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి హైడ్రా బాధితుల పరామర్శలు మొదలుకానున్నాయి.**

- సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ)

హైదరాబాద్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. అనాలోచిత నిర్ణయాలతో పేదలు, దిగువ మధ్య తరగతి ప్రజలు, సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఒక ప్రణాళిక, ఆలోచన లేకుండా ప్రభుత్వమే అలా అనుమతులు ఇచ్చి..ఇలా అక్రమమంటూ హైడ్రా పేరిట హైడ్రామాలు చేస్తూ వందలాది కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నది. మూసీ, హైడ్రా ప్రాజెక్టు విషయంలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ప్రభుత్వ విధానాలను ఎక్కడికక్కడ ఎండగడుతూ ప్రజలకు భరోసా ఇచ్చేందుకు బీఆర్ఎస్ సమరశంఖం పూరించింది. ఈ వారంలో మూసీ పరీవాహక ప్రాంతంలో కేటీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల బృందంతో బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఈ భరోసా యాత్రలో నోటీసులు అంటించిన ఇండ్లలో కలియతిరిగి వారిలో ధైర్యాన్ని నింపనున్నారు. మూసీ పేరిట ప్రభుత్వం ఏ విధంగా లూటీ చేస్తుందో? అమాయక ప్రజల జీవితాలతో ఎలా చెలగాటం ఆడుతుందో వివరించనున్నారు. మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లను ఖర్చు చేయాల్సిన అవసరం ఎందుకు వస్తుందో ప్రశ్నించనున్నారు. గరీబోళ్లకు అన్యాయం జరుగుతుందంటే ఆ ప్రాజెక్టు వద్దని కేసీఆర్ ప్రభుత్వం మానవీయ ముఖ్యమంత్రిగా నిర్ణయాలు తీసుకున్నారని, ఒక్క పేదవాడి కడుపు కొట్టకుండా సుందరీకరణ చేపట్టిన సంగతిని ప్రజలకు వివరించనున్నారు. తొలుత కూకట్‌పల్లి నియోజకవర్గంలో కేటీఆర్‌తో కూడిన ఎమ్మెల్యేల బృందం పర్యటించి హైడ్రా బాధితులను పరామర్శించనున్నది. హైడ్రా అధికారులు చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తూ ప్రజలను కబ్జాదారులు అంటున్న విధానాన్ని ఎండగట్టనున్నారు. మొత్తంగా హైదరాబాద్ ప్రజలకు భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ నాయకులంతా కలిసికట్టుగా కదిలేందుకు సిద్ధమయ్యారు.

### మూసీ నిరసన



డీబీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయవద్దని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. మూసీ సుందరీకరణ పేరుతో అక్రమంగా, అన్యాయంగా దౌర్జన్యంగా కొనసాగుతున్న పేదల గూడుల కూల్చివేతలను ఆపాలని వక్తలు డిమాండ్ చేశారు. మూసీ బాధితులు నిరసన ర్యాలీ తీశారు. -చిక్కడపల్లి

# కొత్త నిబంధనలతో కొర్రీలు..!

హైడ్రా బూచీ.. పంచాయతీ.. లేఅవుట్లంటూ కొత్త పాట

## అయోమయంలో 'ఎల్ఆర్ఎస్'

*లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల ప్రక్రియ ఇష్టారాజ్యంగా సాగుతున్నది. ఇప్పటివరకు పరిష్కరించిన వాటి కంటే తిరస్కరించిన దరఖాస్తులే అత్యధికంగా ఉన్నాయి. ప్లాట్ యజమానులను భయాందోళనలకు గురి చేసేలా ఏదో ఒక కారణం చూపి దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని అధికారులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు హైడ్రా, మరోవైపు గ్రామ పంచాయతీ లే అవుట్‌లు అంటూ సరికొత్త నిబంధనలు పెడుతూ పెద్దఎత్తున దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో ఎల్ఆర్ఎస్ ఆమోదించిన లేఅవుట్‌లోని ప్లాట్‌లకు కూడా ఈసారి 'ఎల్ఆర్ఎస్'ను తిరస్కరిస్తున్నారు. దీనిపై ప్లాట్ యజమానులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఆదాయంపై భారీ ఆశలు పెట్టుకోగా, కనీసస్థాయిలోనూ ఆదాయం రావడంలేదని సమాచారం.*

-హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ)



**సంగారెడ్డి జిల్లా** అమీన్‌పూర్ మున్సిపాలిటీ సుల్తాన్‌పూర్ పరిధి సర్వే నంబర్ 457/1 లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో 2016లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆమోదించింది. అదే సర్వే నంబర్, అదే లే అవుట్‌లో అప్పుడు ఎల్ఆర్ఎస్‌కు వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోనివారు 2020లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ అర్జీలను అధికారులు తిరస్కరిస్తున్నారు. గతంలో హెచ్ఎండీఏ అధికారులే ఈ లేవుట్‌కు ఎల్ఆర్ఎస్‌ను ఆమోదించారు. కానీ ఇప్పుడు దరఖాస్తు తిరస్కరించడం వెనుక మతలబు ఏమిటని ప్లాట్ యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు ఎల్ఆర్ఎస్ తిరస్కరించడం ద్వారా గతంలో ఎల్ఆర్ఎస్ ఆమోదించిన వారికి అనుమతులు ఉన్నట్టా...? లేనట్టా అనే అనుమానాలను యజమానులు వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా సంవత్సరాల కిందట ప్లాట్‌లను కొనుగోలు చేశామని, వాటికి ఇప్పుడు ఎల్ఆర్ఎస్ తిరస్కరించడాన్ని ప్రశ్నిస్తున్నారు. 15 ఏండ్ల కిందట గ్రామ పంచాయతీ చేసిన లే అవుట్‌లను ఇప్పుడు తిరస్కరించడాన్ని యజమానులు నిలదీస్తున్నారు.

### మొత్తం 25.70 లక్షల దరఖాస్తులు

రాష్ట్రంలో మొత్తం 25.70 లక్షల దరఖాస్తులు వచ్చాయి. జీహెచ్ఎంసీలో 1.06 లక్షలు, హెచ్ఎండీఏలో 3.58 లక్షలు, పట్టణాభివృద్ధి సంస్థలు పరిధిలో 1.35 లక్షలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 13.68 లక్షలు, పంచాయతీల్లో 6 లక్షల దరఖాస్తులు వచ్చాయి. 2020లో ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలల పాటు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. ఓపెన్ ప్లాట్లు, నాన్ లేఅవుట్‌కు సంబంధించిన వాటికి దరఖాస్తుదారులు వెయ్యి రూపాయల ఫీజు చెల్లించి, తమ డాక్యుమెంట్ కాపీని సమర్పించారు.దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప..ఇతర లే-అవుట్లను క్రమబద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హెచ్ఎండీఏ, డీటీసీపీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ విషయంలో గందరగోళాన్ని తొలగించాలని, వినతులను పట్టించుకోవాలని ప్లాట్ యజమానులు కోరుతున్నారు.



సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి వద్ద మౌన దీక్షలో స్థానికులు

# విగ్రహం ధ్వంసం చేసిన నిందితుడిపై ముంబైలో 2 కేసులు

## వ్యక్తిత్వ వికాస తరగతుల కోసం సిటీకి సలీం

జకీర్ నాయక్ ప్రసంగాలతో ఉన్మాదిగా.. హిందూమతంపై ద్వేషం

సిటీబ్యూరో: ముంబైకి సల్మాన్ సలీం ఠాకూర్ అలియాస్ సల్మాన్.. ఇస్లామిక్ మత ప్రబోధకుడు జకీర్ నాయక్‌తో పాటు ఇతరుల వీడియోలను ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో చూసి..ఉన్మాదిగా మారాడని..హిందూ మతంపై ద్వేషం పెంచుకున్నాడని విచారణలో వెల్లడయ్యిందని నగర పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలోకి చొరబడిన సలీం.. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసి తన ఉన్మాదాన్ని చూపించిన విషయం తెలిసిందే. విచారణలో నిందితుడి పేరు సల్మాన్ సలీం ఠాకూర్ అలియాస్ సల్మాన్ అని ఎంటెక్ పూర్తి చేసి ప్రస్తుతం ముంబైలోని ముంబ్రా ప్రాంతంలో నివాసముంటున్నట్లు వెల్లడైంది. సికింద్రాబాద్‌లోని మెట్రో పోలీస్ హోటల్‌లో ఇంగ్లిష్ హౌస్ అకాడమీ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఈ నెల మొదటి వారంలో వచ్చినట్లు తేలింది. జకీర్ నాయక్ వంటి వారి ప్రసంగాలు సామాజిక మాధ్యమాల్లో చూసి హిందూ మతంపై ద్వేషం పెంచుకున్నాడు. ముంబైలోనూ ఆరే సబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేశ్ మండపంలోకి కాళ్లకు చెప్పులు వేసుకొని ప్రవేశించి విగ్రహారాధనను అవమానిస్తూ స్థానికులతో గొడవకు దిగడం, అలాగే వసాయి, విరార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మనోకామన సిద్ధిమహాదేవ్ మందిరంలోకి ప్రవేశించి విగ్రహాన్ని ధ్వంసం చేశాడని.. ఈ రెండు ఘటనలపై ముంబైలో కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. కేసు విచారణలో ఉన్నదని, అనవసర ఊహాగానాలు, వదంతులను వ్యాప్తి చేయాకూడదని పోలీసులు ప్రజలను కోరారు.

# మహిళలకు భద్రత కరువు

## కాంగ్రెస్ పాలనలో పెచ్చరిల్లుతున్న అఘాయిత్యాలు

వరుస ఘటనలతో ఉలిక్కిపడుతున్న మహానగరం



**మహానగరంలో అతివలకు రక్షణ లేకుండాపోతున్నది. ఐటీ కారిడార్‌లో జరిగిన లైంగికదాడి ఘటనతో మరోసారి హైదరాబాద్‌లో మహిళల భద్రతపై భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా లైంగిక దాడులు, దాడి యత్నాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. పోలీసులు మాత్రం నేరాలను అరికట్టడంలో విఫలమవుతున్నారు. విజుబుల్ పోలీసింగ్‌ను పూర్తిగా మర్చిపోయారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారా? లేదా? అని పరిశీలించే నాథుడే లేడు. డయల్ 100 ఫోన్ చేస్తే..సిబ్బంది ఎంత సేపట్లో బాధితుల వద్దకు చేరుకుంటున్నారనే విషయాన్ని అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఫలితంగా హైదరాబాద్‌లో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పుతున్నది. మహిళా భద్రత ప్రశ్నార్థకమవుతున్నది.** - సిటీబ్యూరో

**సైబరాబాద్‌లో** సోమవారం అర్ధరాత్రి తరువాత ఆటో డ్రైవర్ యువతిపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటనతో నగరం మరోసారి ఉలిక్కిపడింది. మహిళల భద్రతపై భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి వారానికో ఆందోళన కల్గించే ఘటన జరుగుతుండడంతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్లలోని చాలా పోలీస్‌స్టేషన్ల పరిధిలో అధికారులు నిద్రమత్తులో ఉన్నా.. ఉన్నతాధికారులు వారి పనితీరు ఎలా ఉందనే విషయాన్ని పరిశీలించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నగరంలో వేలాది ఆటోలు, క్యాబ్‌లు తిరుగుతున్నాయి. ఎనీ టైం ధైర్యంగా ఆటోలు, క్యాబ్‌లు బుక్ చేసుకొని భద్రతగా ప్రయాణించే వాతావరణంలో గతంలో ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హైదరాబాద్ నేరాలు పెరగడంతో పాటు శాంతి భద్రతలు గాలికొదిలేశారు. దీంతో పోలీసుల నిఘా తగ్గడంతో నేర స్వభావం ఉన్న వాళ్లు రెచ్చిపోతున్నారు. జూలైలో ట్రై పోలీస్ కమిషనరేట్లలో ఒకే రోజు నాలుగు లైంగికదాడి ఘటనలు జరిగాయి. శాంతి భద్రతలను, నేరాలను అదుపు చేస్తూ నగరాన్ని ప్రశాంతంగా ఉంచడంలో కీలక భూమిక పోషించే పోలీసు వ్యవస్థపై ఇటీవల జరుగుతున్న ఘటనలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

### నగరంలో ఘటనలివీ!

- గచ్చిబౌలి ఠాణా పరిధిలో చెన్నైకి చెందిన ఓ యువతిపై ఆటో డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఐటీ కారిడార్‌లో కలకలం రేపింది.
- నెల రోజుల కిందట బోరబండ ఠాణా పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం బెంగళూరు నుంచి ఇంటర్వ్యూకు వచ్చిన ఓ యువతిపై సంస్థ నిర్వాహకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు.
- కొరియో గ్రాఫర్ షేక్ జానీ భాషాపై లైంగిక దాడి, పోక్సో కేసు నమోదైంది. తనతో పని చేసే యువతిపై లైంగికదాడికి పాల్పడడంతో సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.
- నిర్మల్ నుంచి హరికృష్ణ ట్రావెల్ బస్సులో ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్తున్న ప్రయాణికురాలిపై జూలై 29వ తేదీ రాత్రి కదులుతున్న బస్సులో అదనపు డ్రైవర్ కృష్ణ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలు డయల్ 100కు ఫోన్ చేయడంతో బస్సు నగరంలోకి వచ్చిన తరువాత ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు బస్సును ఆపి డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. అప్పటికే పరారీలో ఉన్న అదనపు డ్రైవర్ కృష్ణను గాలించి పట్టుకున్నారు.
- వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొమ్మరిల్లు రెస్టారెంట్‌కు తనకు ఉద్యోగం వచ్చిందని స్నేహితుడికి పార్టీ ఇవ్వాలనే ఉద్దేశంతో వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు బలవంతంగా మద్యం తాగించి.. హోటల్ గదిలోకి తీసుకెళ్లిన స్నేహితుడు, మరొకరితో కలిసి గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడ్డారు. నిందితులైన గౌతంరెడ్డి, శివారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.
- జనగామకు చెందిన బండారం స్వామి ఆస్ట్రేలియాలో పౌల్ట్రీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఛత్తీస్‌గడ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన యువతితో పరిచయం ఏర్పచుకున్నాడు. హైదరాబాద్‌కు రావాలని సూచించాడు. జూన్ 3న సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో రెండు రోజులున్నారు. ఈ క్రమంలో ఆ యువతిపై స్వామి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఛత్తీస్‌గడ్‌లో ఫిర్యాదు చేయడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మహంకాళి పోలీసులు నిందితుడు ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిసి విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు.
- సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానని నమ్మించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ని ఇంటర్వ్యూకు హోటల్‌కు రమ్మని అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న విశాఖపట్టణానికి చెందిన దంతలూరి సిద్ధార్థవర్మ లైంగికదాడికి పాల్పడ్డాడు. గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.



# చిట్టీల పేరుతో ₹20 కోట్ల టోకరా

## ఈవోడబ్ల్యూలో కేసు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): చిట్టీల పేరుతో మోసగించి దాదాపు రూ.20 కోట్ల వరకు టోకరా వేసి, పరారైన వ్యక్తిపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం...కుత్బుల్లాపూర్, చింతల్‌లోని శ్రీసాయి కాలనీకి చెందిన సీతారామయ్య, అతడి బంధువు మురళితో కలిసి స్థానికంగా చిట్ ఫండ్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వివిధ రకాల చిట్టీల పేరుతో దాదాపు 200 మంది వద్ద నుంచి సుమారు రూ. 20 కోట్ల వరకు డబ్బులు వసూలు చేశాడు. చిట్టీ సమయం ముగిసినా డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో బాధితులు చింతల్‌లోని సీతారామయ్య ఇంటికి వచ్చి చూడగా అతడు కుటుంబంతో సహా పరారయ్యాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితులు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

### అలర్ట్ ప్లీజ్..

సిటీబ్యూరో: గ్రేటర్‌లో మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఆదేశించారు. బుధవారం హైడ్రా కమిషనర్, జోనల్ కమిషనర్లు, ఇంజినీరింగ్, సీఈయస్‌ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంత ప్రజలు ఏదైనా సహాయం కోసం జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ **040-21111111**కు లేదా డీఆర్ఎఫ్ (హైడ్రా) కంట్రోల్ రూమ్ నంబర్ **9000113667**కు సంప్రదించాలని కోరారు.